# "పాపయ్య పాడిబట్టెకొన్నాడు!"

గొల్లపూడి [illegible]

భారతమ్మ నెయ్యి అరువుకోసం పొరుగింటికి పయనమైంది. పొరుగింటి పద్మనాభం సావిట్లో ఎవరితోనో ముచ్చటలాడుతూవున్న కారణాన ఆమె పక్కగొందిలోనుంచి దొడ్డిలోకి దారి తీసి చూచిందిగదా శారదమ్మ పాడిబర్రెదగ్గర కూర్చుని పాలు తీస్తూవుంది. అవలీలగా రెండు శేర్లపాలు పట్టే చెంబూ దాదాపు నిండవస్తూవుంది. తెల్లని పాలమీద నురగ పొంగి పురకలెత్తుతూవుండగా శ్రావ్యమైన శబ్దం చేసుకుంటూ రెండు పాలధారలూ పడుతున్నాయి. ముందు కట్టేసిన పెయ్యదూడ మూతి సాచుతూ బర్రె కదలకుండా రథంలా నిలబడి వుంది. శారదమ్మ ప్రశాంతంగా కూర్చుని అలౌకిక ఆనందంలో మునిగి వున్నదో మరేమో గాని భారతమ్మ పిలిచిన "పిన్నీ" అనే తొలిపిలుపుకు ఆమె వులుకూ పలుకూ లేకుండా కూర్చుండిపోయింది.

"ఓ యమ్మో......పిన్నిగారేదో ఆలోచిస్తూ వున్నారే" అన్నది భారతమ్మ.

శారదమ్మ వెనక్కి తిరిగిచూసి వల్లమాలిన ఖంగారుపడింది. అంతలోనే లేచి నిలబడి "ఆహా భారతమ్మా......ఎవరో అనుకొని వులికిపడ్డాను" అన్నది.

అయితే శారదమ్మ ఖంగారుకు అసలు కారణం వేరే వుంది. శారదమ్మ వస్తుతః మా చెడ్డ అనుమానం మనిషి. ఇదేమో పాలతప్పేలా నిండుతూవుండగా భారతమ్మకళ్లు బర్రెమీద పడ్డాయి. దృష్టిదోషం తగిలి ఆకొసినిచుక్క ఎక్కడ హరాయించుకు పోతాయోనని ఆమెగారి అనుమానం.

"పిన్నీ నెయ్యిచుక్క వుంటే పోద్దూ - వారేమో ప్రయివేటు క్లాసు వుందని పరుగెత్తుకు పోయారు పట్టుమని తెల్లవారకముందే" అన్నది భారతమ్మ. శారదమ్మ అడిగిన మాటకి సమాధానం చెప్పకుండా "ఇంట్లో సుశీల లేదూ" అని అడిగింది. సుశీల శారదమ్మ కోడలు. బర్రెకు పాలు తీసే సమయంలో దొడ్లోకి ఎవర్ని రానివ్వకూడదనే పద్ధతి వొకటి ఆ సంసారంలో వున్నది. ఆ నిర్ణయాన్ని సుశీల వుల్లంఘించి వుంటుందని శారదమ్మకు కోపం కలిగింది.

"సరేలే పిన్నీ లోపల సుశీలతోనే వేయించుకుంటాను—నీ చెయ్యి ఖాళీగా లేదుగదా" అంటూనే వంటయింట్లోకి దారి తీసింది భారతమ్మ.

శారదమ్మ మూతి తమాషాగా విరచి భారతమ్మ వంటయింటిలోకి ప్రవేశించేదాకా చూస్తూనేవుంది. ఆతరువాత మళ్లీ బర్రెదగ్గర చతికిలపడింది. ఇంతలోనే యీ స్వల్ప విరామాన్ని తనకు అనుకూలంగా అన్వయించుకొన్న ఆ బర్రె పాలు ఎగజేపి ఒక్క తన్ను తన్ని మొరాయించింది.

భారతమ్మను తిట్టుకుంటూ పరాకు చిత్తగిస్తూవున్న శారదమ్మ చేతిలోని పాలపాత్ర పట్టుతప్పి పడిపోయింది. తప్పేలా పాలూ అనవసరంగా నేలపాలు అయాయి. భారతమ్మ కళ్లు మంచివపునో కావో యీమెగారికి యిదివరలో సందేహం లవలేశం వుండవచ్చు గాక—కాని యీ ప్రత్యక్ష ప్రమాణంతో ఆ సంశయం నివృత్తి అయింది. ఇక్కడ యీ తతంగం ముగిసే లోగా సుశీల భారతమ్మకు నెయ్యి పోసి పంపించటం జరిగింది.

శారదమ్మ కస్సుబుస్సులాడుతూ వడవంటింటిలోకి ప్రవేశించింది. సుశీల వెన్న తీసి మజ్జిగ వోణ్చే నిమిత్తం పైకి ఎగరవేస్తూ వుంది.

"అప్పనే కోడలా ఆవిడగారికి నెయ్యి పోశావా" అన్నది శారదమ్మ.

ఆమె కంఠస్వరంలో కటుత్వంతో కూడిన వెటకారం కొట్టవచ్చినట్లుగా కనపడటంతో సుశీల తలయెత్తి అత్తగారివంక చూచి ఆశ్చర్యపోయింది.

"ఈమా। నేం భాగ్యానికి ఆ పాపిష్టిదాన్ని దొడ్లోకి మళ్లీరావు దేనికి?" అని సాగదీసుకుంటూ లాయరుప్రశ్న లాగింది శారదమ్మ. సుశీలకు అసలు సంగతి తెలియలేదు.

"ఏవిటి అత్తయ్యా ఎవర్ని గురించి మీరనేది?" అని అడిగింది.

"ఔరా యేమి నంగనాచివే - అదే ఆ పాపిష్టిది...భారతమ్మ."

"ఆ నేనా...దొడ్లోకి పంపానా?" అని తెల్లబోయింది సుశీల.

శారదమ్మ మాట అందుకొని అన్నది—

"అవును నువ్వే...ప్రతి విషయమూ నన్ను సంప్రతించి చేస్తున్నట్టు మహా ఆ భారతమ్మ అనుకోవద్దూ - అందుకని ఆవిడని పనిగట్టుకు పెరట్లోకి తోలావు."

సుశీలకు యింతటి అపనింద చేదుమందులా, గుటక దిగక బాధపెట్టింది. విపరీతమయిన ఆగ్రహమూ అభిమానమూ కలిగినా ఆవిడ బొత్తిగా యీకాలపు మనిషి కాకపోవటం మూలాన అలకని అదుముకొని అన్నది—

"నేనా...నేను పంపానా ఆ భారతమ్మని - భారతమ్మే చెప్పిందా."

"అవునే కోడలా - అదే చెప్పాలా... ముంజేతి కంకణంలా కనపడుతూవుంటేనూ"

"బావుంది వరస...ఆవిడేమో పడిపోయినట్టు పక్కగొందిలోనుంచి వస్తూవుంటేనూ"—

"అవుతే చూసే వూరుకున్నావన్నమాట. అయినా నిన్నని ప్రయోజన మేవుందిలే - నీకు శత పోరుపెట్టి చెప్పాను - బర్రెదగ్గర


పండిత డి. గోపాలాచార్యులవారి
జీవామృతం
కండపుష్టికి. వీర్యవృద్ధికి
ఆయుర్వేదాశ్రమం లిమిటెడ్ మద్రాసు-17

# రచయితలకు మనవి

ఇటీవల కొందరు రచయితలు ఇదివరలో అచ్చయిన తమ రచనలను క్రొత్త రచనలన్నట్లు ఇప్పుడు తిరిగి మాకు పంపడం, కొందరు ఇతరుల రచనలను అన్యభాషలలోనుంచీ, తెలుగులోనుంచీ సంగ్రహించి స్వతంత్ర రచనలుగా పంపడం జరుగుతున్నది. వీరు సోదర రచయితలకు, మాకు జరుగుతున్న అపచారాన్ని గుర్తించడంలేదు. మాకు వచ్చే రచనలను, అనుమానంతో పరిశీలించడం రచయితలకుగాని మాకుగాని గౌరవప్రదం కాదని గుర్తించవలసిందిగా వీరిని ప్రార్థిస్తున్నాము. ఇందువల్ల చిక్కులకు లోనుకావచ్చునని ఇట్టివారు గ్రహించడంమేలు. ఇదివరలో మా పత్రికలోగాని, ఇతర పత్రికలలోగాని ప్రచురించబడిన వేలాది రచనలను చదివి జ్ఞప్తిలో ఉంచుకోడం ఏ సంపాదకునికైనా అసాధ్యమైన విషయమని ప్రత్యేకం చెప్పనవసరంలేదు.

అన్యథా సూచించినప్పుడు తప్ప, మాకు వచ్చే రచనలు మొదలైనవి, పంపినవారి స్వతంత్ర రచనలేననే, భావంతోనే మేము ప్రచురించడం జరుగుతుందని అందరూ గుర్తించ ప్రార్థన.

## మాకు కథలు, గేయాలు, చిత్రాలు, ఫొటోలు పంపేవారు ఈ క్రింది అంశాలనుకూడా గమనించ ప్రార్థన.

ప్రచురించని వానిని త్రిప్పిపంపగోరే వారు బుక్ పోస్టుకు అవసరమైన స్టాంపులను, రచనలూ, చిత్రాలూ, ఫొటోలతోనే చేర్చిపంపాలి.

బుక్ పోస్టుకు అణా స్టాంపుకు తక్కువ కాకుండా పంపాలి.

రచనలను కాయితానికి ఒకే వైపున సిరాతో వ్రాసిపంపాలి.

ఫొటోలు కనీసం కార్డు సైజులో వుండాలి. నెగటివ్‌లు స్వీకరించబడవు.

చిత్రాలు ఇండియన్ ఇంకుతో వేసిపంపాలి. రంగుల చిత్రాలు స్వీకరించబడవు.

ప్రచురణ విషయాన్ని వెంటనే తెలియచెయ్యడం కష్టం.

నిరాకరించబడిన రచనలను త్రిప్పి పంపడానికి మాకు కనీసం ఒక మాసమైనా వ్యవధి అవసరం. ఫొటోలు, చిత్రాల విషయంలో యింకా ఎక్కువ వ్యవధి కావలసివుంటుంది.

ప్రచురించే వానిని గురించి ప్రచురించే ముందు మాత్రమే తెలియపరచగలము.

మాకు పంపిన రచనలను, ఫొటోలను, చిత్రాలను గురించి మా కార్యాలయం నుంచి ఎవ్విధమైన సమాచారమూ అందనిదే, వాటి ప్రతులను యితర పత్రికలకు పంపవద్దని ప్రార్థన.

రచయితలూ, చిత్రకారులూ, సహృదయంతో సహకరించగలరని విశ్వసిస్తున్నాము.

—సంపాదకుడు.

# పాపయ్య పాడిబఱ్ఱె కొన్నాడు!

నేను తగలడ్డప్పుడు ఎవర్నీ రానీయాకు సుమా అని -" అన్నది శారదమ్మ.

"ఇంతకీ యేవి జరిగిందని మీరు యింత యిదైపోతారూ?"

"ఏవి జరిగిందా...అదేమో అటు పోయి చూడు" అని దొడ్డిగుమ్మం చూపించింది అత్త.

సుశీల చూసి సంగతి అర్థంచేసుకుంది. "కొడ కొత్తమనిషినిచూసి బెదిరింది గావున్ను" అనుకున్నది ఆమె. మాట మార్చి తను చేసిన ఘనకార్యం చెవిని వేసేగాని ఆవిడ ఆగ్రహం తగ్గదని అనుకున్నది సుశీల- "అవునా అత్తయ్యా...ఆవిడకు పదిరోజుల కోమాటు యిదేవి వరసా అంట కమ్మని నెయ్యి పట్టుకుపోయి వెధవ డాల్డా నెయ్యి తగలమోయటం అందుకనే యీసారి బుద్ధి వచ్చేపని చేశాను-" అని ఆగింది అత్తగారు యేమిటంటుందో వినగలందులకు.

ఆ విషయం యేదో చెప్పమన్నట్లుగా చూసింది శారదమ్మ.

"నిన్న మామగారికి పూరీలు వెయ్యగా మిగిలిన నెయ్యి లేదూ.. అది కాస్తా కుమ్మరించి పూరుకున్నాను. లేకపోతే యేమిటి నాకు వళ్లు మండిపోయింది."

"వెలగ బెట్టినటేవుంది. ఆవిడ నలుగురిలోనూ యాగి చేసేస్తుంది" అంది శారదమ్మ.

"ఆ చేస్తుంది...అదీ చూద్దాం. గట్టిగా అంటే యేమోనమ్మా ఒక కాపు ఎక్కువ అయినట్టుంది అనమ్మ" అన్నది సుశీల.


శారదమ్మ యిహ నేమీ అనకుండా కూట్లో చెయ్యిపెట్టి గుప్పెడు పుప్పొతీసి చరచరా దొడ్లోకి పోయింది.

*　　*　　*

పాపయ్యగారు ఆవూరు హైస్కూలులో తెలుగు పండితులూ భారతమ్మగారి పెనిమిటీన్నూ. స్కూలు ఫైనలు పరీక్షలు దగ్గర్లో పడటంవల్ల ప్రయివేటు క్లాసు ముగించుకొని యింటికి చేరుకునేసరికి పన్నెండు కొట్టారు. ఆయన అనుష్ఠానాలు అయినవనిపించుకొని అన్నానికి కూర్చునేసరికి మగో అరగంట పట్టింది. భర్తకు వడ్డించి ఎదంగా పీటవేసుకుని కూర్చుంది భారతమ్మ. పాపయ్య తీరిగ్గా కూర్చుని భార్యవంక చూసి అన్నాడు - "రామం యేడే" అని.

"ఎక్కడికి ఎగడాడో...నాతో చెప్పిపోవటమంటూ వుంటేగా—దెబ్బలాడి వరిగెత్తాడు బజారువేపుకి" అన్నది భారతమ్మ.

"దెబ్బలాట దేనికి" ముద్ద పైకెత్తి అడిగాడు పాపయ్య.



వేసవి మధ్యాహ్న వేళ

ఫోటో: యస్. సి. జోగారావు, (కాకినాడ.)

"పెరుగు పొయ్యమన్నాడు అన్నాల దగ్గర...పొయ్య లేదనీ—"

"పోనీ కాస్త పొయ్యకపోయావా" అన్నాడు పాపయ్య ముద్ద నవులుతూ.

"ఎక్కణ్ణుంచి పోసేది? కొనేకే రెండ రోజులదాయె...సవాపావులో బోడిపరాచిక మున్నట్టు—"

పాపయ్య తలయెత్తి భార్యవంక చూసి తల దించుకున్నాడు. తనకు పోయినవాళ్ళు పోగా మిగిలింది వొక కొడుకు. వాడు పెరుగు అడిగితే పోయించలేకపోయాడు తను. పొద్దున క్లాసులో తను పిల్లలకు చెప్పిన "ద్రోణపరాభవ"మనే పాఠ్యభాగం గుర్తుకు వచ్చింది. తనకు రోజుకు శేరుపాలు కొనే తాహతు లేదని పాపయ్య పంతులు అభిప్రాయం. అదిగాక ఆయన కానిడబ్బు రెండుసార్లు తిప్పి చూసుకొని మరొకరి హాస్తగతంచేసే మనిషి. తన జీవితాన్ని బహునియమబద్ధం చేసుకున్నాడు.

ఈవిధంగా మానసిక ఆందోళనతో మనన పడుతున్న పాపయ్యగారికి పప్పు ముద్ద ఎందుచేతనో తెగవెగటనిపించింది. ఈసారి ముద్ద వాసన చూసి భారతమ్మని ప్రశ్నించాడు.

"పాడు నెయ్యి...ఎక్కడ పోయించుకున్నావూ?" అని.

"మీరేమో ఝూషించుకు వెళ్లిపోయారాయె పోయి శారదమ్మ నడిగి గిన్నెడు అరువు తెచ్చాను" అంటూనే పొయ్యి శెగను పెట్టిన నేతిగిన్నె వాసన చూసి అన్నది—

"ఆసి దీని జిమ్మడా! వాడిన నెయ్యి తగలబోసింది."

"అంటే—" అన్నాడు పాపయ్య భార్యవంక చూసి.

"ఏదో పిండివంటబాపతు మిగిలిన నెయ్యి పోసింది. ఆసి దీని పిసినారితనం మండా" అన్నది. పాపయ్య మాట్లాడలేదు. సాక్షాత్తు విషాహారంలా పోజుపెట్టి నాలుగు ముద్దలూ విషంముద్దల్లా మింగేశాడు సమలుపండానే. అంతే మళ్ళీ నెయ్యి వెయ్యమనలేదు అతను. అందునిమిత్తం భారతమ్మ మనస్సు ఎంతో కష్టపెట్టుకుంది.

పాపయ్య భోజనం పూర్తిచేసుకొని కులాసాగా కునుకుతీస్తున్నాడు తనగదిలో. భారతమ్మ వాకిట్లో మాగాయముక్కలు ఎండబెట్టి కర్రపుచ్చుకు కాపలాకాస్తూ సావిట్లో కూర్చుంది. పొద్దున యేసుముహూర్తాన శారదావాసానికి తను వెళ్లిందో యేమోగాని తరువాత ఆమె మనస్సు పట్టు తప్పిపోయింది. ఆతరువాత జరిగిన విషయాలు కూడా ఆమె మనస్సును మరీ చికాకు చేసేశాయి. రామం తొమ్మిదేళ్ల వెధవ. వయస్సుకు మాలిన పటుదల అయితే వాడికి వుందిగాని ముక్కుపచ్చలారని పుత్రకుంక వాడు. పద్దఅన్నంలో గేదె పెరుగు కావాలని ఎవరికుండదు. వాడేమీ కాని కోరిక కోరలేదు. పదేళ్లు లేని వెధవ—ఆ పట్టుదల ఎట్టా అబ్బిందో తెలియదు గాని రెండు దాటినా వాడు యింకా యింటి పట్టుకు చేరుకోలేదు. ఆ! వాడుమట్టుకు

# ★ పాపయ్య పాడిబఱ్ఱె కొన్నాడు ★

ఎక్కడికి పోతాడు—పినతల్లిగారింటికి పోయివుంటాడు.

భారతమ్మ యీ ఆలోచనలతో మునిగి వుండగా శారదమ్మగారి రథం ఏ మూల నుంచో చెంగున మాగాయ ముక్కలమీదికి లంఘించి నోటికి పట్టిన ముక్కలు ఫలహారం చెయ్యటమే కాకుండా సద్దుకొని లేచిన భారతమ్మ తన దరికి చేరుకోక పూర్వమే ఆ చాప నోటితో ఒక లాగులాగి పాలికపాలు ముక్కలు చెదరగొట్టి ఆపైన తన నాలుగు కాళ్ళకూ పనిచెప్పి అరుచుకుంటూ పరుగెత్తింది ఆ గొడ్డు. గేదెను శాపనార్థాలు పెట్టుకుంటూ ఆ ముక్కలు ఎత్తి చాపమీద వేసి యీసారి కర్ర చాపమీదే ముక్కలకు అడ్డంగావుంచి తిరిగివచ్చి సావిట్లో చతికిలపడింది ఆమె.

తను ఎన్ని బఱ్ఱెలు చూడలేదూ యిన్ని వరలో. ఏమాట కామాటే చెప్పుకోవాలిగాని అవన్నీ శారదమ్మగారి గేదెముందు దిగదుడుపుకు కూడా పనికిరావు. రెండు శేర్లపాలు పట్టే చెంబు అవలీలగా నిండిపోవటం తను కళ్ళారా చూసింది. కాని ఒక్కందుకు తనకు చిత్రమవుతూంది. ఆ సుశీల అత్తనుమించిన కోడలు. మొహమాటం యీషణ్మాత్రం లేకుండా వాడిన చెయ్యి పోసింది. ఏమైనా కానీగాక ఎవళ్ళకి యింత అతిశయం అంత మంచిదికాదు. పోయిన యేడు పరీక్షలికి శారదమ్మ వచ్చి నానాగడ్డీ కరిచి తన్ను బతిమాలపట్టేకదా రెండో కొడుకు పైక్లాసులో పడ్డాడు... వీళ్ళ బుద్ధి అంతా ఏడదాటిం తరువాత బోడిమల్లన్నా అన్న రీతిగా వుంటుంది. ఛీ! బొత్తిగా కృతజ్ఞత అంటూ లేని జన్మలకి సిగ్గూ ఎగ్గూ అంటూ వుంటేగా. ఆ శారదమ్మ మొహాన్ని కొట్టినట్టు తనూ వొక పాడిబఱ్ఱె కొన్నదా చెప్పుచ్చుకు కొట్టినట్టు వుంటుంది. పుత్రసన్నాసి కూడా మొహంవాచి కొట్టుకుంటున్నాడు. ఓ వందరూపాయలు మనవి కావనుకుంటే సామాన్యంలో ఒక బఱ్ఱె దొరకకపోదు. ఇంత సొమ్ము భర్త తేలిగ్గా వదలిపెట్టనిమాట అయితే సత్యమేగాని తను పూనుకుని ఒప్పించాలి. ఈ మగవాళ్ళకి తను వుద్దేశాలు అర్థంకావు. శారదమ్మకు పోటీగా తను యీ పథకం వేసినట్టు భర్తకు తెలిసిందా ససేమిరా అందుకు సమ్మతించడు. భర్త మనసుకు ఆనేటట్టుగా విషయ ప్రస్తావన చేయటంలోనే తన తెలివి వుపయోగించాలి.

భారతమ్మ యీతీరున ఆలోచిస్తూ వుండగానే పాపయ్య పగటినిద్ర చాలించి సావిట్లోకి వచ్చి వాల్చివున్న పట్టెమంచం మీద కూర్చున్నాడు. ఆపైన భారతమ్మ వంక చూసి—

"కాసిని మజ్జిగ తెచ్చిపెట్టు" అన్నాడు.

అప్పుడే గాడ్పులు మొదలెట్టాయి. వేడిగాలి యీ చెవులోనుంచి ఆ చెవులోకి కొడుతూవుంది. భారతమ్మ వడమటింటిలోకి వెళ్ళిన తరువాత "కాస్త వుప్పురాయి కూడా వెయ్యి" అని సావిట్లోనుంచే కేకేశాడు పాపయ్య.

భారతమ్మ యిచ్చిన నీళ్ళమజ్జిగతాగి వెనక గోడకి జారపడి విశ్రాంతి తీసుకుంటున్న భర్తనుచూసి అంది భారతమ్మ—

"ఇంటి మజ్జిగ అయితే బావుంటాయి."

పాపయ్య భార్యవంక చూసి అన్నాడు - "ఏదీ అబ్బాయి వచ్చినట్టులేడే" అని.

"పినతల్లిగారింటికి వేంచేసివుంటాడు - అయినా యింతలేసివాళ్ళకే యింతింత కోపాలా" అని ఆగి భర్తవంకచూసి అన్నది. "ఏమండీ" అని-

పాపయ్య తన భార్య ఏదో చెప్పాలని అనుకుంటూ వున్నట్టు గ్రహించాడు.

"నీ మనస్సులో బాధ గ్రహించాను - అయినా పిచ్చిదానా మనం యింత యాతనపడేది వాడికోసమేగదా" అన్నాడు పాపయ్య.

"అవుననుకోండి... పుత్రకుంక అడిగితే ఒక్క పెరుగుబొట్టు వేయలేకపోయాను... నా చేతులు విరిగిపోనూ" అని భారతమ్మ తన్ను తాను తిట్టుకొంది దిగులుపడ్డ మొహంతో.

భర్తను తన వశవర్తినిగా చేసుకోటానికి భారతమ్మ ప్రయోగించిన ప్రథమాస్త్రం యిది—

అసలు విషయం తట్టతగలబెట్టినట్టుగా చెప్పితే కొందరికి నచ్చదు. ప్రతిమనిషికీ ఓ మూడ్ వుంటుంది. అది గ్రహించి దానికి అనుగుణంగా చెప్తేనేకాని ఫాయిదా వుండదు. భారతమ్మ యీవిధంగా చెప్పిందనుకోండి—

"నాకు పాడిబఱ్ఱెమీద మనసు పోయిందీ- యింటిలో పాడివుండటం పాడి.

చక్కగా కవ్వముచేత ధరించి గోపికలా తిప్పుకోవాలనీ వెన్నముద్దలుచేసి మీ చిరుపెదవుల కా మిసిమి ముద్దలు మింగబెట్టాలని మనసుగా వున్నదనీ భారతమ్మ అన్నదనుకోండి పాపయ్యలాంటి తెలుగు పంతులు అందులకు ఆహ్లాదమంది అంగీకరిస్తాడనుకోవటం ప్రస్తుతం మరవటమే అవుతుంది. పాపయ్య ప్రబంధనాయకుడు కాదు - పదహారణాల తెలుగు పండితుడు. ఆయన యేమంటాడంటే—

"[illegible] రెండణాల పెరుగుతో నవసరసములు తీ[illegible]కుంట నాటింటాబడి రూపష్యంబులు విలిచి పాడిబఱ్ఱె గొనుట పాడియా... చాలుం జాలు నేరని వినిరేని నోర్వప్పి నవ్వగలారు" అని కవి సార్వభౌములకు మెచ్చువచ్చు భాషలో భార్యతో చెప్పటమే కాకుండా మళ్ళీ ఆమాట ఆ నోట వినటానికి అతను నూరయినా అంగీకరించడు.

కాబట్టి పుత్రకుంక కోరిక వీలుగా వుపయోగించుకొని తనమనసులోని మాటను అన్యాపదేశంగా తీర్చుకోవటమే సముచితమని నిశ్చయించుకొన్న ఆ యిల్లాలు తద్దీత్యా పెనిమిటిని దగాచేయటానికే నిశ్చయించుకొంది.

పాపయ్య దిగాలుపడివున్న భార్యవంక చూసి అన్నాడు -

"తక్కువ నోములూ - ఎక్కువ ఫలాలు ఎక్కణ్ణుంచి వస్తాయి... అయినా దేనికైనా రోజు రావాలి"

భారతమ్మకు భర్తచెప్పిన యీ సబబు తృప్తి నివ్వలేదు.

"మనకష్టాలు యెప్పుడూ వుంటాయి... అయినా యిప్పుడు మన కేమంత యిబ్బంది వచ్చిందో నాకేమీ తెలియటంలేదు. ఇంకొక్కయేడాది దాటితే వాడుమాత్రం అడగబోయి అడుగుతాడా... అయినా వాడి ముద్దూ ముచ్చటా - అదీనూ - "

తనకు తనయునిమీద గల మమత అనే లోపాన్ని గుర్తించి భార్య దాడిచేస్తూ వుందని అనుకున్నాడు పాపయ్య. అయితే ధనసంపాదనలో గల కష్టాల్ని గుర్తించిన వాడే డబ్బు తగలబెట్టడంలోవున్న తప్పిదాన్ని తెలుసుకోగలడు. ఇంతెందుకు తనకు తండ్రి తద్దినాలుమట్టుకు మిగిల్చిపోయాడు. తనకీనాడు రెండు ఎకరాల కొంద్ర వున్నదీ అంటే అదంతా రెక్కల కష్టంవల్ల సంపాదించినదే. వచ్చే ఎనభై రూపాయలజీతంతో నెలకో పాతికో పరకో మిగుల్చుకొని యిటు యీ పొలం కొనటమూ - అటు వెయ్యి రూపాయలకి యిన్సూరుచేసుకోవటమూ నెరవేర్చాడు అతను. తనుచేసే ప్రతిపనీ కుటుంబక్షేమం దృష్టిలో పెట్టుకుగాని చెయ్యడు. కోరికలు ప్రతివాళ్ళకీ వుంటాయి. ఆ కోరికలను జయిస్తేగాని యిటు ఐహికమూ అటు ఆముష్మికమూ అయిన ఆనందం అందుబాటు కాదు. అదీగాక కోరికలలోవున్న ఒక గొప్పదుర్గుణం యేమిటంటే ఆ కోరిక తీరగానే వేరే మరొకకోరిక కలుగుతుంది. అందుకనే పోతన్నగారు అన్నారు "ఆశ అనే తాడు చాలా నిడుపుసుమా దానికి అంతంలేదు" అని. మరిన్నూ ఒక్క రూపాయి సంపాదించి అది కాస్తా ఖర్చు చేసి చేతులు దులుపుకు కూర్చోవటం

ఏమంత తెలివైనవని. అనితంగా ఎవరైనా చెయ్యగల్రు. ఆ ఒక్క రూపాయిని ఖర్చు చెయ్యకుండా అట్టిపెట్టుకోవటం ఒక యెత్తూ, ఆ రూపాయకే మరోరూపాయిచ్చి రెండురూపాయలు చెయ్యటం ఒక యెత్తూను

"పోనీ ఒక నెలపాటు మరోఅణా పెరుగు పోయించుకో ... ఆ పైసంగతి ఆలోచించుకోవచ్చు" అన్నాడు పాపయ్య.

భర్త ఒక మెట్టు దిగాడు. అవక్క మెట్టూ దిగి అక్కడ సావకాశంగా చతికిలపడ్డాడు. ఈ పరిస్థితుల్లో తను ఎంతో జాగర్తగా మాట్లాడితేగాని ఆయనగార్ని మరోమెట్టు దింపటానికి వీలువుండదు.

"అణా పెరుగా!" అని ఆశ్చర్యపోయింది భారతమ్మ.

"ఏమీ అర్ధణాదే చాలునంటావా" అన్నాడు పాపయ్య మళ్ళీ పైమెట్టు సగం యెక్కి.

"అణా పెరుగు ఎవరి ముక్కులో పొయ్యనూ -" అని సాగదీసుకుంటూ మూతి ముణిచింది ఆమెగారు.

పాపయ్యకు వీలుచిక్కింది యీసమయంలోనే -

"అద్దిగదీ అసలుసంగతి బయటపెట్టవేమి యిందాకణ్ణుంచీ - ఆ కోరికేదో నీకేవుందని అఘోరించక న్నోరూ వాయీలేనివాడిమీద నెపం దేనికి -" అన్నాడు భార్యవంక పరీక్షగా చూస్తూ.

తనఅంతర్యం భర్త గుర్తించాడని తెలుసుకున్న భారతమ్మ పాలినచెక్కిళ్లు నల్లపడ్డాయి. ఇహ భర్తచేత తను తలపెట్టిన కార్యం పూర్తిచేయించటం తివిరి యిసుమున తైలంతీయటమేఅవుతుంది. అయినా కార్యసాధకులు అంతలోనే నిస్పృహపడకూడదు. అందువల్ల భారతమ్మ యీ పరిస్థితుల్లో తన అవసరానికి పనికివచ్చే ఆగ్రహం మొహం మీదకి తెచ్చుకొని అన్నది—

"అవును మరి యీ సమయాల్లో ఎవరికైనా వుంటా యి—తోబుట్టువులున్న వాళ్ళకి తెలుస్తుందనుకున్నాను మరి."

పాపయ్య యీ పాశుపతాస్త్రం తాకిడికి తట్టుకోలేక క్షణకాలం ఉక్కిరి బిక్కిరి అయాడు.

సంగతి యేమిటంటే భారతమ్మకు నెల తప్పి మూడునెల్లు దాటింది!

పాపయ్య ఒక్క క్షణందాకా మాట్లాడలేకపోయాడు. తొమ్మిది సంవత్సరాల తరువాత భార్యకు మళ్ళీ కాన్పు వస్తోంది. కాపురానికి వచ్చిన పిదప తను ఆమెకో నగా నాణెమూ చేయించినపాపానపోలేదు. ఇంతెందుకు నిజం చెప్పాల్సివస్తే పట్టుమని పాతికపెట్టి భార్యకో పట్టుపుట్టమన్నా కొని తెచ్చియిచ్చిన సందర్భమున్నూ లేదు. పాపయ్య మాట్లాడలేక—అహ అసలు మాటలు రాకరాక తబ్బిబ్బు ఔతున్న సమయం చూసి భారతమ్మ అన్నది—

"చూడండి చాలాకాలంనుంచీ మనసులో ఓ కోరిక వున్నదండీ" అని ఆగి అన్నది "మీరు మరోలా అనుకోకుండా వుంటే చెప్తాను" అని భర్తవంక చూచింది ఆమె.

"అనుకోవటం దేనికి... కానీ" అన్నాడు అతను.

"అది కాదండీ ఒక్క గేదె పాడన్నా లేని యిల్లు ఏమి యిల్లు చెప్పండి."

పాపయ్య మాట్లాడలేదు. అసలు భారతమ్మ వేసింది ప్రశ్న కాదు......దీనికి జవాబూ లేదు. ఏతా వాతా జవాబు చెప్పినా అది తనకు వుపకరించదని అతనికి తెలుసు. అయినా భారతమ్మ యీ హేతువాదం ఎక్కడ నేర్చుకుందో అతనికి అర్థం కాలేదు. అలంకార సంగ్రహంలో అర్థాంతరన్యాసమనే అలంకారం ఒకటుంది. సామాన్యవిషయాన్ని ప్రత్యేక వివరణతో గానీ, ప్రత్యేక విషయాన్ని సామాన్య వివరణతో గాని సమర్థిస్తే ఆ అలంకారం అవుతుంది. అర్థాంతరంగా యీమెగారు అర్థాంతరన్యాసాలంకారాన్ని తనకు వీలుగా ఎల్లా వుపయోగించింది.

"ఒక్క గేదె పాడన్నా లేని యిల్లు ఏమి యిల్లు చెప్పండి."

"అందువల్ల మనకో గేదెపాడి కావాలి గదా" అనేది సామాన్య విషయం కావచ్చు. ఇది అసమానమైన అర్థాంతర న్యాసాలంకారమున్నూ అవవచ్చు. దీనికి తనకు పనికి వచ్చే జవాబు లేదు. అందువల్ల యిట్టి సమయాల్లో మౌనమె విభూషణమని తెలిసిన పాపయ్య అవుననీ కాదనీ కూడా అనలేదు.

"గొడ్డూ గేదే శ్రీమహాలక్ష్మి అన్నారు" —అన్నది భారతమ్మ మళ్ళీ.

ఈ వచనానికి వ్యాఘాతం లేదు—అందువల్లనే పాపయ్య వులకనూ లేదు పలకనూ లేదు. భర్త పట్టిన మూగనోము భారతమ్మ సహించలేకపోయింది. తన యుక్తిప్రయుక్తులవల్ల అతనిని ఒప్పించి గేదె కొనిపించాలని ఆమె కోరిక. నోరు విప్పితే ఏమి చిక్కో అని అతనేమో శతించుకు కూచున్నాడు.

"ఏమండీ మాట్లాడరు?" అడిగింది ఆమె.

"నువ్వు చెప్పదలుచుకున్నదంతా చెప్పు—" అన్నాడు అతను.

"అవురా! అప్పుడు మీరు చెప్పే ఒక్క మాటా చెప్పిపోతారు అవునా—"

"మరి యింకేం చెప్పేది నువ్వు చెప్పినవన్నీ నిజమే అవవచ్చు. అయినా నిప్రతిసం గాని మనది ఒక గేదెపాడికి సరిపడ్డ కుటుంబమా యేమన్నా నా—" అని పాపయ్య వూపిరి పీల్చుకు అన్నాడు— "ఒక్క మూడు అణాల పెరుగయితే మనకి ఎల్లిపోల్లానూ. నువ్వేమో వుత్తమనిషివి కావు బద్ధిగొడ్డు అనగానే మాటలా— బోలెడు అరవచాకిరి చెయ్యాలి."

"మీకు యిష్టం లేకపోతే అన్నీ చెప్తారు. అయినా ఎవరింటి చాకిరీ ఎవరికి బరువు...యిహ కుటుంబమంటారా — మనకు సరిపోగా మిగిలినవి పారబోసుకోం కదా—"

ఈ మాటలు పూర్తిచేస్తూవుండగానే ఆ యిల్లాలి అంతరంగంలో ఒక ఆలోచన పరుగు లెత్తింది. ఈ విషయం ఏ తీరున బయట పెట్టటమా అని ఒకటి రెండు నిముషాలు నిశ్శబ్దంగా ఆలోచించుకొని, ఆ మాటలే నెమరుకు తెచ్చుకుంటూ నంగి నంగి అన్నది.

"ఇంతకీ నూటపాతిక పెడితే రెపో శేరున్నరో మాపో శేరున్నరో యిచ్చే గేదె దొరుకుతుంది"

"మూడు శేర్ల పాలు మనకు దేనికీ అంటాను—యిందాకట్నుంచీ నా గోల అదే" అన్నాడు పాపయ్య. భార్య పన్నిన వలలోకి స్వేచ్ఛగా ప్రవేశిస్తూ.

"మీదంతా అదో అయోమయం అండీ మరీనూ - మీకు తెలియదుగాని ఆ శారదమ్మ ఒక్క గేదె పాడివల్లే ముప్ఫైరూపాయల దాకా సంపాదిస్తూవుంది. ఆమాత్రం పాడి గేదె వుండాలిగాని కాస్త కుడీ ఎడమా వాడుకుంటే నెలకో నలభై చేసుకోవటం ఏమంత కష్టం."

"ఏమన్నావూ...మనం పాలూ పెరుగూ అమ్ముకోవటమా. పరువూ మర్యాదా అదీ ఆలోచించే యీమాట అంటున్నావా?" అడిగాడు అతగాడు.

"మన గేదెపాడి మనం అమ్ముకుంటుంటే పరువు బుగ్గయే ప్రమాదం ఏవుంది - ఎవరి మోచేతికింద నీళ్లూ తాగటం లేదుగదా" అన్నది భారతమ్మ.

పాపయ్య యిందుకు వెంటనే జవాబు చెప్పలేకపోయాడు. అందుకు వొక ప్రబల కారణం ఏమిటంటే నిజంగా ధనసంపాదనకు మార్గమే దొరకాలిగాని మరి పరువు మర్యాదలకుపట్టే ప్రమాదాన్ని పాపయ్య అంతగా పట్టించుకునే మనిషి కాదు. భర్త తన ప్రణాళికకు వప్పుదల అవుతున్నట్టుగా గ్రహించింది భారతమ్మ.

"చూడండి నేనేమో వెర్రెత్తి చెప్తానని మీరు అనుకోవచ్చుగాక - పూటకి రెండు శేర్లు యిచ్చే గేదె 150 రూపాయలు పెడితే దొరుకుతుందంటారా."

"ఊఁ."

"ఇహనేం ఒకశేరు అయితే మనకి ముక్కోటా...యిహపోతే మూడుశేర్లూ వుంటాయి; ఒక్క శేరునీళ్లు పోశామా నాలుగుశేర్లు అవునంటారా."

"అవును - గాని" భర్తను మాట పూర్తి చెయ్యనీకుండానే—

"చూడండి - నీళ్ళ పాలు శేరు వది

# ★ పాపయ్య పాడిబర్రె కొన్నాడు ★

అణాలు నాలుగుశేర్ల పాలు పదహారు అణాలు. అంటే యెంతన్నమాటా—" అని అడిగింది ఆమె.

"రోజుకి రెండున్నరా....అంటే నెలకి ...డెబ్బై అయిదున్నర అవుతుంది. ఓ యబ్బో" అన్నాడు పాపయ్య ఆశ్చర్య పోతూ.

"మరేమిటనుకున్నారూ...దాదాపు మీ జీతమంత" అన్నది భారతమ్మ సంతోషంతో పొంగిపోయి.

"మరేమో మనకి కమ్మని నెయ్యీ పెరుగూను...అన్నట్టు పొద్దున మీరు గోధుమ తుకులు తినేసరికి నా ప్రాణం పునూరుతుంది.. వెధవది బజారు నెయ్యి అధ్వాన్నంగానే వుంటోంది - అంటే నెలకో పదో పదిహేనో ఖర్చు తప్పుతుంది."

"నీ మాటలయితే కోటలు దాటుతున్నాయి. అంతా లాభం సంగతే చెప్తున్నావు గాని ఖర్చుసంగతి మాటే లేదు." అన్నాడు పాపయ్య నిసలైన ఆర్థిక శాస్త్రవేత్తలా.

భారతమ్మకు భర్త యీ ప్రశ్న వేస్తాడని ముందే తెలుసు గాబట్టి తడుముకోకుండా వెంటనే అన్నది.

"పచ్చగడ్డి మోపు అరణాలు...చిట్టూ తవుడూ రోజుకో వేడు; ఎటొచ్చీ రోజుకు రూపాయకంటే ఖర్చు వుండదు - యింతే గదా" అని చప్పరించింది ఆవిడ - ఆ విషయాన్ని తేలిగ్గా తోసిపారేస్తూ.

భారతమ్మ చెప్పిన విషయాలు ఆలోచించగా సబబుగానే తోచాయి పాపయ్య పంతులుకు—

"చూశారూ...మరోమాట మరిచాను... పిడకలు వుంటాయి కాబట్టి కట్టెల ఖర్చు తగ్గుతుంది."

"సరేలే నువ్వింత మనసు పడుతుంటే నా కేమంటానికి నోరు రావటం లేదు. చేసుకోలేవే అని నా బాధ" అన్నాడు పాపయ్య.

విజయగర్వంతో ఆనాడు భారతమ్మ మనస్సు మనస్సులో లేదు.

*　　*　　*

"ఇహ యీ బర్రెపాలివ్వదు. ఏ కాడికో అమ్మేస్తేనే లాభం" అన్నది శారదమ్మ పెనిమిటికీ కొడుకుకూ అన్నం వడ్డిస్తూ.

పద్మనాభం భార్యవంక చూసిఅన్నాడు- "ఈని రెండు నెల్లుకూడా కాలేదు. అప్పుడే యేమొచ్చింది"

"అదుగో పోయినశుక్రవారం పొద్దున్నే ఆ భారతమ్మ చూసింది. ఈ నాలుగురోజుల నుంచీ అర్ధశేరు తీసేసరికి ప్రాణాలు పోతున్నాయి. ధార అసలే లేదు. దృష్టి తగిలుంటుంది."

"పోనీ మంగలిరాముడుచేత తాడన్నా కట్టించావా" అన్నాడు పద్మనాభం.

"ఆ అదీ చేయించాను. అబ్బే ఏమీ లాభం లేదండీ ... పులపలు రుబ్బి పెడుతున్నాను. మొన్నేమో యింగువ మింగించాను ... అబ్బే యిహ లాభం లేదు"

"అర్ధాంతరంగా బేరానికి ఎవరుచ్చుకుంటారు. కొన్నా సగానికి యాభైరూపాయలు తక్కువ అడుగుతారు."

"మనమో నూటఅరవైకి కొన్నాముగదా సగానికైనా సరే తోసెయ్యండి. మరొకటి కొనుక్కుందాము" అన్నది శారదమ్మ.

"అమ్మటానికే యిస్తే అమ్మచ్చు ... మళ్ళీ యిటువంటిగేదె దొరకద్దా...పోయిన యేటికి నిండా సంవత్సరం యిల్లు గడిపింది - ఏమో అమ్మాలంటే నాకు మనస్సు పోవటం లేదు" అన్నాడు పద్మనాభం.

వంటయింటిపంచలోనివున్న సానిట్లో కూర్చుని మల్లెపూలచెండు కట్టుకుంటున్న సుశీల యీ సంభాషణ వింటూనే వున్నది - మెల్లిగావచ్చి ద్వారబంధంఆనుకునిఅన్నది-

"అత్తయ్యా ఆ భారతమ్మ గేదె బేరం చేస్తూ వుందిట..."

"తప్పేలానిండా పాలుచూసింది పాడిమీద మనసు పోయింది ... చూశారా .... నేనంటే కాదన్నారు ... తెలిసిందా" అన్నది భారతమ్మ. పద్మనాభానికి ఏవి తెలిసిందో యేమోగాని మౌనానికి తెలిసినట్టుగా తల వూపాడు.

కొడుకు కుటుంబరావు తల్లివంక చూసి అన్నాడు -

"పోనీ యీబర్రె ఆవిడకే అంటగట్టేస్తే సరి తీరిపోతుంది."

"ఇస్తే కళ్ళనద్దుకు పుచ్చుకుంటుంది ... అయితే ఆ పాపయ్య శుద్ధ అనుమానాలమనిషి పాలుచూసి పుచ్చుకోవటమేవస్తే మనబర్రె యాభై కిచ్చినా పుచ్చుకోరు" అన్నది తల్లి.

"ఏమైనాగాని...అది వాళ్ళకి తోసేస్తేనే మంచిది" అన్నాడు కుటుంబరావు.

కోడలు యింకా ద్వారబంధాన్ని ఆనుకునే వున్నది. భారతమ్మ నెయ్యి అరువు నిమిత్తంవచ్చిననాడు తట్టిన ఆలోచనలాంటి ఆలోచన మరొకటి ఆవిడ మనసులో మెదలటంతో వెంటనే అన్నది -

"ఆ భయం అక్కర్లేదు అత్తయ్యా - పాలుతీస్తుండగా యిదివరకే చూసింది కాబట్టి భారతమ్మ గేదెను ఆపళంగానే కొనుక్కుంటుంది ... ఆవిడదిష్టి ఆవిడమీదగానే పోవాలి"

సుశీల ఆలోచన ఆ యింట్లో మొదట్లో ఎవరికీ అర్థంకాలేదు. అయితే ఆరాత్రి కుటుంబరావుతో మాత్రం "ఆవిడ దిష్టి ఆవిడ మీదగానే పోవాలీ" అని అనటంలో గర్భితమైన అర్థం చెప్పటంతో అతగాడు ఆమె తెలివితేటలకి అమితంగా మురిసిపోయాడు.

*　　*　　*

ముందు దూడను స్కూలు కుర్రాడు వొకడు నడిపించుకు వస్తూండగా పాపయ్య బర్రెను తోలుతూ తలవాకిట నిలబడివున్న భార్యనుచూసి అన్నాడు.

"అదుగో ... ఆరోకలి అకింటా లాగు" అని.

భారతమ్మ రోకలి నద్దింది. పాపయ్య బర్రెను దానిమీదుగా గెంతించి దొడ్లో కట్టేసిన అనంతరం భార్య యిన్ని పసుపునీళ్ళయితే గేదెమీదుగా దిగదుడిచి పారబోసింది. ఆతరువాత వంటయింటిలో దాలి పొయ్యి తవ్వుతున్న భర్తదగ్గరికిపోయి అన్నది -

"ముందు వో రెండు ఎండు గడ్డిమోపులు అవుసరం - తాతయ్యగారి బూసయ్యనన్నా అడిగి పట్టించుకురండి"

"అల్లాగేలేగాని యీలోపల అటకమీద కర్రలున్నాయి. ఆ రాజాగాడిని ఎక్కించి నెవళంగావున్న కర్ర ఒకటి దింపు. కవ్వానికి కావల్సివస్తుంది." అని చెప్పితనపనిమీద బయటికిపోయాడు.

భారతమ్మ కర్ర దింపించి ఒకపక్క చెక్కిస్తూవుండగా వుత్తచేతులు వూగించుకుంటూ పాపయ్య వచ్చేశాడు ... ఆమె ప్రశ్నార్థకంగా భర్తవంక చూసింది.

"తాతయ్య కవతగాడు పాలంలోకి పోయాడు. తెచ్చే మనిషి లేక సాయంత్ర



శ్రీమతి రమా హరిహరన్, ప్రసిద్ధ వైణికురాలు. సిలోన్ రేడియోలో జూలై 12 రాత్రి 7-30. కు ఈమె వాద్యం ప్రసారించబడుతుంది.

కొంటానన్నాను. మూడు రూపాయలు ఇచ్చివచ్చాను." అన్నాడు.

"పెద్దవి గడ్డిమోపులు మూడు రూపాయలా! పోనీలెండి బజారుకు వెళ్ళి ఒక మోపు పచ్చిమేతా, ఓ మరకం పులవలూ, చిట్టూ పట్టుకురండి" అని భర్తను పురమాయించి పంపింది భారతమ్మ.

భారతమ్మ కొన్న పాడిబర్రె మోపు పచ్చిమేతా మెక్కింది. పులవలు రుబ్బి కుడితి పెడితే కడివెడయితే తాగింది. శుభ్రంగా పెయ్యదూడకు పాలు చేపింది. పాపయ్య పాలు తియ్యను కూర్చోగానే విశ్వాసం లేకుండా ఆ గొడ్డు ఒక్క తన్ను తన్ని పాలతప్పాలా ఎగరదన్నింది!

"అయ్యో! బర్రెకు దాపట కూర్చోవాలేమోనండీ" అంటూ వెలపలపక్క కూర్చోబోతున్న భారతమ్మని లోగడ విరోధం మనసులో వుంచుకొని గావన్ను బుసకొట్టి తరిమేసింది ఆ చతుష్పాత్తు!! భారతమ్మ కొడుకు రాముంచేత శారదమ్మకు కబురు పెట్టింది...బర్రె కొత్తచేసిందేమో కొంచెం కష్టమనుకోక వచ్చి రెండు పూటలు పాలు తీసిపెట్టమని—అయితే వాడిచేతే తిరుగు జవాబు పంపింది శారదమ్మ......తనేమో వెలుపల వుంది....సుశీలేమో పొరుగింటికి రాదుట.

వరసాగ్గా మూడు రోజులూ బర్రె పాలు ఇవ్వకపోవటం అటుంచి వరసాగ్గా మూడు తాపులు తన్నింది పాపయ్యగారిని. అయిదోరోజు భారతమ్మ స్వయంగా వెళ్ళింది శారదమ్మను పిలుచుకువచ్చే నిమిత్తం. సుశీల పిలుపు అందుకొని అన్నది-

"అత్తగారు జరంతో మూలుగుతోంది.... నిన్నటినుంచీ మాసినకన్ను ఎరగదు" అని.

వాళ్ళచేతా వీళ్ళచేతా తీయించబోయినా బర్రె పాలుచేప కూడా తన్నటమే నేర్చుకొంది యీ అయిదు రోజుల్లోనూ. విసుగెత్తిన పాపయ్య వరుసగా సామదాన భేద దండ నీతులు సర్వమూ ఆ గొడ్డుమీద ప్రయోగించినా గిద్దెడు పాలు దానిదగ్గర నుంచి రాబట్టుకోలేకపోయాడు. క్లాసులో పాఠం చెప్తున్నా ఆయన ధ్యాస అంతా పాడిబర్రెమీదే వుండిపోయేది. మరో వారం రోజులకి బర్రె మాలిమి అయింది. అయితే నేమి అర్ధశేరు పాలకన్నా ఒక్క బొట్టు అధికంగా రాల్చలేదు. నెల రోజులు చూసినా ఆ పాలు బొటాబొటిగా సరిపోవటమూ ఆ నెల ఖర్చు ముప్పై రూపాయలు పెరగటమూ పాపయ్య పంతులు గుండెల్లో రైళ్లు పరుగెత్తాయి. ఎందువల్లనో యేమో గాని భారతమ్మకు కూడా పాడిమీద మోజు తగ్గిపోయింది. వచ్చే చాకిరీతో ఆమె నలిగి పోవటం పాపయ్యకు మరీ ఆందోళన అధికమైంది.

"పడవది తద్దినం కొనుక్కున్నావు. ఇప్పుడు ఏమంటావో చెప్పు" అని సంజాయిషీ అడిగాడు పాపయ్య. ఇందుకు ఆమె మట్టుకు ఏమి చెప్పగల్దు? అనుకున్న అంచనాలు తలకిందులైతే ఎవరు మాత్రం ఏమి చేస్తారు? గొప్ప గొప్ప కొమ్ములు తిరిగిన ఆర్థిక శాస్త్రవేత్తలు కూడా ముందు ఘనంగా అంచనాలు ఆశ చూపి చివరికి లోటు బడ్జెటు చూపుతున్న రోజులివి.

నేనేమన్నా కలకన్నానా—శారదమ్మ యిల్లా దగాచేస్తుందని...అదేమి చిత్రమో నేను చూస్తూవుండగానే రెండు శేర్ల పాలూ అల్లాగా తీసింది ఆవిడ. ఎదురుగుండా చూసినదాన్ని ఎల్లా కాదనుకూ. మన నష్టం గేదె...మనదనష్టమైపోనూ" అని తిట్టి ఆమె ఎంతో కష్టపెట్టుకుంది. పాపయ్య విసిగిపోయాడు. ఒకపక్క బర్రె తిండి ఖర్చు తారామండలానికి ఎగబాకుతోంది. ఇటుమాస్తే దానివల్ల వచ్చే రాబడి అతలమైపోయింది. చూస్తూ చూస్తూ వుండగానే భారతమ్మ చిక్కి సగమయింది. చివరికి డబ్బూ పోయే...శనీ పట్టే అన్నట్టుగా వుంది వ్యవహారం.

"ఇదుగో యీ బర్రె వచ్చినప్పట్నుంచీ మనకు అన్నిందాలా శని దాపురించింది. దీన్ని అయినకాడికి అమ్మేస్తేనేగాని మనం మన లోకంలో పడం....దీని మొహాన నూటయాభై రూపాయలు తగలేయించావు" అన్నాడు పాపయ్య.

బర్రె పీడ విరగడయితే అంతే చాలు అనుకునే స్థితికి వచ్చింది భారతమ్మ కూడా.

"అవును మరి......నాకూ భయంగా నే వుంది బాబూ...బిడ్డ వచ్చిన వేళా గొడ్డు వచ్చిన వేళా అని—"

* * *

పాపయ్య తొందరపాటువల్ల ఆ బర్రెనే ఓ పాతిక తక్కువచేసి తిరిగి పద్మనాభమే కొనుక్కున్నాడు.

ఆరోజు రాత్రి కోడలు సుశీల పెరటింటా [illegible] గేదె ఆ బర్రెపాలతో పాలకుండ నిండ కాని నిండా రెండు శేర్ల పాలూ అత్తగారికి చూపించి అన్నది—

"మాశారా అత్తా. గేదె శని భారతమ్మ తిట్లతోనే పోయింది" అని! ఏమైతేనేమి యీ బేరంవల్ల శారదమ్మకు పాతికరూపాయలు లాభమూ ఓ నెల గేదె ఖర్చూ తప్పింది. ★


పంచతంత్రం

బొమ్మల కథల పుస్తకం

మొదటి భాగం

(మిత్రభేదం, మిత్రలాభం)

కర్త: కీ॥ శే॥

విశ్వాత్ముల నరసింహమూర్తి

వెల: రూ. 1-8-0

ఆంధ్రగ్రంథమాల,

మద్రాసు - 1

రాజా స్నో

నిగనిగలాడే నీలకేశాలకు

రాజా హెయిర్ ఆయిల్




కౌంట్ ఆఫ్ మాంట్ క్రిస్టో

రెండు భాగములు

ఒక్కొక్క భాగం రు. 3-8-0

టామ్ సాయర్

ప్రపంచయాత్ర

అనువాదం :

నండూరి రామమోహనరావు

వెల రు. 1-8-0

ఆంధ్ర గ్రంథమాల,

మద్రాసు-1